

క్రీడలకు పెద్ద పీట

ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజరెడ్డి అన్నారు. సోమవారం ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లా హాకీ పోటీలు ప్రారంభమయ్యాయి. - 8లో



వైభవంగా లక్ష దీపోత్సవం

బి.కొత్తకోటలో సోమవారం రాత్రి ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. శ్రీమహా విష్ణుసేన ఆధ్వర్యంలో ఐదోసారి కార్తీకమాస చివరి వారం లక్ష దీపాలతో లక్ష దీపోత్సవ నిర్వహించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.200
రెండోరకం	రూ.90	రూ.148



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 264 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	-	380
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు : 25.380 కిలోలు

సాధికారత సాకారం

- బడుగు, బలహీన వర్గాల ఉన్నతికి విశేష కృషి
- ప్రతి పేదవాడి తలుపు తట్టిన సంక్షేమ పథకాలు
- నేడు రాజంపేటలో సామాజిక సాధికార యాత్ర



రాజంపేటలో సామాజిక సాధికారత సభా వేదికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

సాక్షి రాయచోటి : ఒకప్పుడు అడుగడుగునా బడుగులకు అన్యాయం..అణగారిన వర్గాలంటే చిన్నచూపు...అందలం ఎక్కించకపోగా అణగదొక్కే పరిస్థితి. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధిచి దశాబ్దాల కాలం గడుస్తున్నా వారిలో మార్పు లేదు. అనుక్షణం అంటరాని తనంగా చూస్తూ..వారిని అల్లంత దూరాన ఉంచేవారు. పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా సామాజిక వర్గాలకు న్యాయం జరిగిన పరిస్థితులు ఎంతమాత్రం లేవు. రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు సమన్యాయం అందించడం తోపాటు అన్ని వర్గాలు బాగుండాలన్న సంకల్పం వైఎస్సార్ సీపీలో ప్రస్ఫుటంగా కనిపించింది. అందుకే వెనుకబడిన సామాజిక వర్గాలకు అధికారంలోకి రాగానే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేసింది.

మాటల్లో కాదు...చేతల్లో చూపిన ప్రభుత్వం

గతంలో రాజ్యాధికారం, సామాజిక న్యాయం మాటలు చెప్పుకునేందుకు మాత్రమే. ప్రస్తుత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ దానిని ఆచరణలో చూపెట్టింది. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలతోపాటు కాపులకు ప్రభుత్వం ప్రత్యేకంగా చూసుకుంటూ వారి ఎదుగుదలకు కృషి చేస్తోంది. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా వారికి అనుకున్న సమయం ప్రకారం ప్రత్యేకంగా నిధులను అందిస్తూ సమాజంలో వారిని గొప్ప స్థానానికి తీసుకెళ్లేలా ప్రభుత్వం ముందుకు వెళుతోంది. ఆయా సామాజిక వర్గాలకు చెందిన వారికి రాష్ట్ర ప్రభుత్వం పదవుల్లోనూ అగ్రస్థానాల్లో నిలబెట్టి ప్రత్యేక గుర్తింపును ఇచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వారికి ఈ ప్రభుత్వంలో ప్రత్యేక గుర్తింపు తీసుకు రావడంపై అన్ని వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో సామాజిక వర్గాలకు న్యాయం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎన్నడూ జరగని విధంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల సంక్షేమం జరిగింది. జిల్లాలో జగనన్న చేదోడు పథకం ద్వారా టైలర్లు, నాయీ బ్రాహ్మణులు, రజకులు 45,922 మందికి రూ. 45.92 కోట్ల ఆర్థికసాయాన్ని ప్రభుత్వం అందించింది. వైఎస్సార్ కాపు నేస్తం పథకం ద్వారా 38,821 మందికి రూ. 58.28 కోట్లు, ఈబీసీ నేస్తం పథకం ద్వారా బీసీ వర్గాలు 45,985 మందికి రూ. 68.98 కోట్లు, స్వయం ఉపాధి కింద ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు 171 మందికి రూ. 9.93 కోట్ల ఆర్థికసాయం ఇచ్చింది. జిల్లాలో జగనన్న వసతి దీవెన పథకం ద్వారా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారీలకు చెందిన 1,06,933 మంది విద్యార్థులకు రూ. 121.44 కోట్లు, జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు 225969 మంది విద్యార్థులకు రూ. 154.16 కోట్లను అందించారు. ఇవి కాకుండా ప్రతి పథకంలోనూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు పెద్ద సంఖ్యలో లబ్ధి చేకూరింది. అలాగే జిల్లాలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు ఇంటి స్థలాలు, పక్కా గృహాల మంజూరులో అధిక ప్రాధాన్యత ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 73,069 గృహాలు మంజూరు చేయగా, అందులో 55,878 గృహాలను ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకే మంజూరు చేశారు. ఎస్సీలకు 11,144, ఎస్టీలకు 3016, బీసీలకు 34,981, మైనారిటీలకు 6737 గృహాలను మంజూరు చేశారు. వీటి నిర్మాణాలకు ఇప్పటివరకు ఎస్సీలకు రూ. 116.52 కోట్లు, ఎస్టీ గృహాలకు రూ. 31.59 కోట్లు, బీసీల గృహాలకు రూ. 335.33 కోట్లు, మైనార్టీల గృహాలకు రూ. 63.15 కోట్లను చెల్లించారు.

రాజంపేట సామాజిక వర్గాల ప్రజలకు భారీ లబ్ధి

రాజంపేట నియోజకవర్గానికి సంబంధించి ఆయా సామాజిక వర్గాలకు భారీ ప్రయోజనం ఒనగూరింది. ఎస్సీలకు సంబంధించి 62,236 మందికి ప్రయోజనం అందింది. అలాగే బీసీలకు సంబంధించి 1,21,986 మందికి, మైనార్టీలకు సంబంధించి 7190 మందికి, ఎస్టీలకు సంబంధించి 11,316 మందికి, కాపు వర్గానికి సంబంధించి 35,408 మందికి, ఓసీల్లో వెనుకబడిన 52,461 మందికి డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా భారీ లబ్ధి చేకూరింది. రాజంపేట నియోజకవర్గానికి సంబంధించి నాన్ డీబీటీ ద్వారా 1,53,436 మందికి రూ. 41,58886803 కోట్లు, డీబీటీ ద్వారా 144861 మందికి రూ. 12143061934 కోట్ల ప్రయోజనం అందింది. అంతేకాకుండా ఆస్పత్రులు, పాఠశాలల్లో నాడు-నేడు పథకం కింద పంచాయతీరాజ్ శాఖ ద్వారా సచివాలయాలు, ఆర్బీకేలు, గ్రంథాలయాలు, బల్క్‌మిల్క్ సెంటర్ల తదితర నిర్మాణాలను చేపట్టారు.

సామాజిక న్యాయాన్ని పాటించిన ఏకైక సీఎం వైఎస్ జగన్



దేశ చరిత్రలో సామాజిక న్యాయాన్ని, ధర్మాన్ని పాటించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనార్టీలకు సీఎం జగన్ చేసిన మంచిని వివరించి, ఆయా వర్గాలను ఏకం చేయాలన్న లక్ష్యంతోనే సామాజిక సాధికారిత యాత్ర పేరుతో బస్‌యాత్రను వైఎస్సార్‌సీపీ చేస్తోంది. ఈ యాత్రను రాజంపేటలో విజయవంతం చేస్తాము.

– మేడా మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

యాత్రను విజయవంతం చేద్దాం



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే సామాజిక సాధికారిత కొనసాగుతోంది. రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల కోసం లక్షల కోట్ల రూపాయలను సంక్షేమ పథకాల రూపంలో నేరుగా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుంది. అన్ని చోట్ల సామాజిక సాధికారిక బస్‌యాత్రకు జనం నుంచి విశేషస్పందన లభిస్తోంది. రాజంపేటలో కూడా యాత్రను విజయవంతం చేద్దాం

– ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్

బీసీలను ఓటు బ్యాంకుగా చూసిన చంద్రబాబు



టీడీపీ పాలనలో సామాజిక సాధికారత నిర్లక్ష్యానికి గురైంది. చంద్రబాబు బీసీలను ఓటు బ్యాంకులా చూశారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలను మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలుగా చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దే. సామాజిక న్యాయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌వల్ల సాధ్యమైంది. రాజంపేటలో బస్‌యాత్రలో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలు పెద్దఎత్తున పాల్గొని విజయవంత చేయాలి.

– జి.కృష్ణారావుయాదవ్, పట్టణవైఎస్సార్‌సీపీ కన్వీనర్, రాజంపేట

బస్సుయాత్రను జయప్రదం చేయాలి

ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆకేపాటి, మేడా, రామసుబ్బారెడ్డి

రాజంపేట : పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట మంగళవారం నిర్వహించే సామాజిక సాధికారత బస్సు యాత్రను జయప్రదం చేయాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, జిల్లా రీజనల్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డిలు పిలుపునిచ్చారు. మేడాభవన్‌లో సోమవారం విలేకర్లతో వారు మాట్లాడుతూ అన్నివర్గాలు ప్రజలు, పార్టీ క్యాడర్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీగా తరలిరావాలన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద బడుగు బలహీన వర్గాల వారికి అనేక రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వీటిని మైనార్టీలు, బీసీలు సద్వినియోగం చేసుకొని ఎంతగానో అభివృద్ధి చెందారన్నారు. దీన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్ష పార్టీలు నోరు పారేసుకుంటున్నాయన్నారు. వీరికి రానున్న ఎన్నికల్లో ఓట్ల రూపంలో బుద్ధి చెబుతారన్నారు. బస్సుయాత్రలపై ఎల్లోమీడియా విషం చిమ్ముతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక సాధికార బస్సు యాత్రలకు జనం నుంచి విశేషస్పందన లభిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను వందశాతం అమలుచేశారన్నారు. టీడీపీ ఉత్తుత్తి మేనిఫెస్టోను ప్రవేశపెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించడం వారికి అలవాటైపోయిందని ఎద్దేవా చేశారు. సమావేశంలో ఆకేపాటి సోదరుడు ఆకేపాటి అనిల్‌రెడ్డి, ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పాఎల్లారెడ్డి, పట్టణవైఎస్సార్‌సీపీ కన్వీనరు కృష్ణారావుయాదవ్, దండుగోపి, జడ్పీటీసీ దాసరి పెంచలయ్య, జేసీఎస్ చైర్మన్లు వడ్డెరమణ, మందరం గంగిరెడ్డి, బీసీజిల్లానేత పసుపులేటి సుధాకర్, వైఎస్సార్‌సీపీ నేతలు నడివీధి సుధాకర్, పాపినేని విశ్వనాథ్ రెడ్డి, పోలిమురళీ, ఉమామహేశ్వరరెడ్డి, సౌమిత్రి, ఆర్ముగం విశ్వనాథ్ పాల్గొన్నారు.

సంక్షేమం పరుగులు

అణగారిన వర్గాలకు ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాల్లో అరకొర భాగస్వామ్యం ఉందేది. అది గతంలో ఉన్న పరిస్థితి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ చరిత్రను తిరగరాసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సమున్నత గౌరమిచ్చింది. పేదలకు ఆర్థిక చేయూత నిచ్చేందుకు తొలి రోజు నుంచి అడుగులు పడుతున్నాయి. అర్హత ప్రామాణికంగా పేదల గడపలకు సంక్షేమం పరుగులు తీస్తోంది. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే పథకాలను తీసుకొస్తున్నారు. సామాజిక న్యాయం పాటిస్తూ, రాజకీయ ఉన్నతికి తోడ్పాటు అందించిన ఏకైక సర్కార్ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

పూర్తయిన ఏర్పాట్లు

రాజంపేట : సామాజిక సాధికార బస్సుయాత్రకు రాజంపేట సర్వంసిద్ధమైంది. మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు బస్సు యాత్రను నిర్వహించేందుకు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి నేతృత్వంలో అన్ని ఏర్పాట్లను సోమవారం పూర్తి చేశారు. పాతబస్టాండు (వైఎస్సార్‌సర్కిల్)లో ఆర్‌ఎస్‌రోడ్డు రూటలో సభావేదికను నిర్మించారు. నియోజకవర్గంలోని వీరబల్లి, సుండుపల్లె నుంచి వచ్చే వారికి రాయచోటిరోడ్డు, సిద్ధవటం, ఒంటిమిట్ట, నందలూరు నుంచి వచ్చే వారి కోసం గుండ్లూరు వద్ద భోజన సదుపాయ కేంద్రాలను ఏర్పాటుచేశారు. వైఎస్సార్‌సీపీ జెండాలు,ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలు ఉన్న ఫ్లెక్సీలతో పట్టణం శోభాయానంగా మారింది.



బస్సు యాత్ర సాగేదిలా..

మంగళవారం మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 మధ్య ప్రెస్ కాన్ఫరెన్స్ పట్టణంలోని మన్నూరు వద్ద ఉన్న తోట కల్యాణమండపంలో జరుగుతుంది. ర్యాలీ 2 గంటలకు ప్రారంభమవుతుంది. అంతకముందు ఎల్లమ్మగుడి వద్ద అమ్మవారికి హారతి కార్యక్రమం నిర్వహిస్తారు. 2.20 గంటలకు ఆర్టీసీ బస్టాండుకు చేరుకుంటుంది. అక్కడ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారు. 2.40కు డా.బీఆర్ అంబేడ్కర్, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారు. అక్కడే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. అనంతరం ర్యాలీగా అమ్మవారిశాల సమీపంలోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి, మున్సిపాలిటి క్లాంపెక్స్ వద్ద ఉన్న జ్యోతిరావుపూలేకి నివాళులు అర్పిస్తారు. ర్యాలీ పాతబస్టాండు(వైఎస్సార్‌సర్కిల్)కు బస్సు యాత్ర చేరుకుంటుంది. అక్కడ సభను 3గంటల నుంచి 4.30 గంటల వరకు నిర్వహిస్తారు. సాధికార బసు యాత్రకు వచ్చిన ముఖ్య అతిధుల ప్రసంగాలు ఉంటాయి. ముఖ్యమంత్రి ప్రజలకు చేసిన మేలును ప్రజలకు తెలియచేశారు.



రాజంపేట పట్టణంలో స్వాగత ఫ్లెక్సీలు

న్యూస్‌రీల్

13న కరువు బృందం పర్యటన

రాయచోటి అర్బన్ : కేంద్ర కరువు బృందం ఈనెల 13న జిల్లాలో పర్యటించనుంది.ఈ విషయాన్ని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 13న ఉదయం అనంతపురం నుంచి బయలుదేరి 11 గంటల నుంచి 11.45 నిమిషాల వరకు బి.కొత్తకోట మండలంలోని కొత్త ఊరు, గొల్లపల్లె గ్రామాల్లో దెబ్బతిన్న వేరుశనగ పొలాన్ని, మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు తంబళ్ళపల్లె మండలం గుండ్లపల్లె గ్రామంలో సాగుచేసిన వేరుశనగ,కంది,పత్తి పంటలను, మధ్యాహ్నం 2.15 నుంచి 2.45 వరకు గుర్రంకొండ మండలంలోని తరిగొండ, మర్రిపాడు గ్రామాల్లో సాగుచేసిన వేరుశనగపంటను పరిశీలిస్తారన్నారు. 3గంటలకు చిన్నమండెం మండలం బోనమల,చాకిబండ గ్రామాల్లో సాగుచేసిన వేరుశన పంటలు, 4.45కు లక్కిరెడ్డిపల్లె మండలం యర్రగుడి, 5 గంటలకు రామాపురం మం డలం గోపగుడిపల్లె, కల్పనాయునిచెరువు గ్రామాలలో సాగుచేసిన వేరుశనగ పంటలను పరిశీలిస్తారన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు, రైతులు కరువు బృందం సభ్యులను కలిసి కరువు పరిస్థితులు, జరిగిన పంటనష్టం గురించి వారికి వివరించాలని కోరారు.

15న ఇంటర్వ్యూలు

మదనపల్లె : మదనపల్లె మెడికల్ కాలేజీకి సంబంధించి సీనియర్ రెసిడెంట్ డాక్టర్ పోస్టుల భర్తీకి ఈనెల 15న వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మురళీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల పరిధిలో 54 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. అనాటమీ..5, ఫిజియాలజీ..3, బయోకెమిస్ట్రీ..4, ఫార్మకాలజీ..4, పాథాలజీ...4, మైక్రోబయాలజీ..4, ఫోరెన్సిక్ మెడిసిన్..3, కమ్యూనిటీ మెడిసిన్..3, జనరల్ మెడిసిన్..3, పిడియాట్రిక్..1, రెస్పిరేటరి మెడిసిన్..1, జనరల్ సర్జరీ..2, ఆర్థోపెడిక్..2, ఈఎన్‌టీ..1, ఓబీజీ..2, రేడియో డయాగ్నసిస్..2, అనస్థిషియాలజీ..2, డెంటిస్ట్రీ..1, ఎమర్జెన్సీ మెడిసిన్..6 మొత్తం 54 ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 15న ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 లోపు జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. వివరాల కోసం 7702456827 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్‌వో సత్యనారాయణ

రాయచోటిటౌన్ : ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డీఆర్‌వో సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జగనన్న చెబుదాం స్పందన కార్యక్రమంలో సర్వేశాఖ ఏడీ జయరాజ్‌తో కలసి ఫిర్యాదులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీకరించిన ఫిర్యాదులపై క్షేతస్థాయి అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్, ఎస్‌ఎల్‌ఏ, రీఓపెనింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని చెప్పారు.

13న డీఫార్మసీ అడ్మిషన్లు

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్(ఎంపీపీ/బైపీసీ) అర్హత గల విద్యార్థులకు డిప్లొమా ఇన్ ఫార్మసీ(డి.ఫార్మసీ)నందు అడ్మిషన్స్ కొరకు డిసెంబర్ 13వ తేదీ ఉదయం 10 గంటలకు కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో హాజరుకావాలని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. విద్యార్థినిలు ఇంటర్ మార్కు మెమో, ఎస్‌ఎస్‌సీ, జనన ధృవీకరణపత్రం, స్టడీ సర్టిఫికెట్(6 నుంచి ఇంటర్ వరకు), క్యాస్ట్ సర్టిఫికెట్ మరియు ఆధార్‌కార్డుల ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.6300.. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.5700 ఫీజు తీసుకురావాలన్నారు. వివరాలకు 9640637907, 9985391616, 9440144057 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రతిపాదనలు ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని కొండాయపల్లెలో ఉన్న బాలసదనంలోని బాలికల కోసం ప్రత్యేక అవసరాలు నిర్వహించడానికి వివిధ స్వచ్ఛంద సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నామని జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ సాధికారత అధికారి శ్రీలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుభవం కలిగిన స్వచ్ఛంద సంస్థలు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, మూడేళ్ల ఆడిట్ రిపోర్ట్, సంస్థకు చెందిన వివిధ పత్రాలతో ప్రతిపాదనలను ఈ నెల 30వ తేదీ లోగా సమర్పించాలన్నారు.

14న కౌన్సెలింగ్

కడప రూరల్ : మెడికల్ ఆఫీసర్‌గా ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 14వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఇందుకు సంబంధించిన మెరిట్, సెలక్షన్ జాబితాను కడప.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని తెలిపారు.

అధునాతన వసతులతో పోలీసు భవనాలు

డీఎస్పీ, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల భవనాల ప్రారంభోత్సవంలో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి,చిత్రంలో ఎమ్మెల్యే తదితరులు

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో రూ.3.50 కోట్లతో నిర్మించిన డీఎస్పీ, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల భవనాలు అద్భుతంగా ఉన్నాయని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి కితాబిచ్చారు. సోమవారం సాయంత్రం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో రూ.3.50 కోట్లతో నిర్మించిన ఈ భవనాలను కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే జి.శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, అన్నమయ్య ఎస్పీ కృష్ణారావు, కడప ఎస్పీ సిద్ధార్థ్‌కౌశల్‌లతో కలిసి ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా ఏర్పడిన తరువాత జిల్లాకు వచ్చిన డీజీపీకి మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషాతో కలిసి ఆత్మీయ స్వాగతం పలికారు. తొలుత రాయచోటి-చిత్తూరు మార్గంలో నిర్మించిన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ భవనాలను ప్రారంభించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో కలియతిరిగి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల రికార్డులో డీజీపీ తన సందేశాన్ని స్వహస్తాలతో రాశారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ దగ్గరకు వచ్చిన డీజీపీకి డీఎస్పీ మహబూబ్‌బాషా, టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి, రూరల్ సీఐ తులసీరామ్‌లు పుష్పగుచ్ఛాలను అందించి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం సమీపంలో నిర్మించిన డీఎస్పీ కార్యాలయ సముదాయాన్ని వారు ప్రారంభించారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ ఈ కార్యాలయాల ఏర్పాటుకు పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ సహకారం అందించినప్పటికీ స్థలాల కేటాయింపులోను, భవనాల నిర్మాణాలలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి చొరవ అభినందనీయమన్నారు.

పోలీస్‌స్టేషన్ ప్రత్యేకతలు:

1.50 ఎకరాల్లో రూ.2 కోట్లతో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను, ఎస్‌డీపీఓ కార్యాలయాన్ని రూ.1.50 కోట్లతో నిర్మించారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లో అన్ని సౌకర్యాలతో పాటు విశ్రాంతి గది, రోడ్డు సేఫ్టీ, కౌన్సెలింగ్ సెంటర్, విశాలమైన పార్కింగ్ సౌకర్యం కల్పించారు. డీఎస్పీ కార్యాలయంలో కూడా విశాలమైన ప్రాంగణంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో అధికారులను స్థానిక ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని అభినందించారు.

రెండో పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపండి

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో రోజు రోజుకూ పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని రెండో పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని డీజీపీ స్థానిక అధికారులకు సూచించారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి రాయచోటిలో రెండో పోలీస్‌స్టేషన్ అవసరం ఉందని, తప్పకుండా ఏర్పాటు చేయాలని కోరడంపై డీజీపీ పై విధంగా స్పందించారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ప్రస్తుతం 32 మంది సిబ్బంది ఉన్నారని అప్‌గ్రేడ్ చేయడం ద్వారా సీఐతో పాటు 42 మంది పూర్తి స్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. త్వరలో ఎస్‌ఐలకు ప్రమోషన్లు ఇచ్చి వంద అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్లలో సీఐలను నియమించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భవిష్యత్తు తరాల కోసం ఉమ్మడిగా ఉండాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



మంగంపేట కాపుపల్లె గ్రామంలో జరిగిన గ్రామ సభలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

ఓబులవారిపల్లె : భవిష్యత్తు తరాలకోసం గ్రామస్తులు అందరు ఉమ్మడిగా ఉండాలని నిర్ణయాలను తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. సోమవారం మంగంపేట కాపుపల్లె గ్రామస్తులకు పునావసం కల్పించేందుకు ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. మంగంపేట కాపుపల్లె ,ఆరుంధతివాడ, హరిజనవాడ గ్రామస్తులకు పునరావాసం ఇంటి స్థలాలు ఏర్పాటు చేశారు. ఇందులో హరిజనవాడ ,ఆరుంధతివాడ గ్రామస్తుల అంగీకారంతో ఇంటి స్థలాలు కేటాయించి పునరావసం ఆర్థికసాయాన్ని అందించారు. కాపుపల్లె గ్రామస్తులు మాత్రం సమ్మతించపోవడంతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో డెబ్బయి శాతం మంది ఇంటి స్థలాల కేటాయింపునకు సంతకాలు పెట్టారని, 30శాతం మంది సంతకాలు చేయలేదని అన్నారు. గ్రామాలను తరలింపు ప్రతిష్టాత్మకమైనదని ఒక సారి నిర్ణయం తీసుకొన్నాక తరువాత అది తప్పు అయితే భవిష్యత్తులో బాధపడి ప్రయోజనం లేదని అన్నారు.గ్రామస్తులు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏపీఎండీసీ, రెవెన్యూ అధికారులకు అన్ని విధాలా సహకరించామని, ప్లాట్‌ల కేటాయింపులో చిన్న చిన్న సమస్యలు అభ్యంతరాలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. వెంటనే ఆయన గ్రామస్తులతో విడివిడిగా ఓపికతో చర్చించి అందరూ ఏకాభిప్రాయానికి వచ్చే విధంగా కృషి చేశారు.దీంతో ఇంటి స్థలాలు తీసుకునేందుకు అంగీకరించారు. ఈమేరకు సంతకాలు చేసి తహసీల్దార్‌కు అందజేస్తే మూడు రోజుల్లో పునరావాసం కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ పుల్లారెడ్డి,సీపీఓ సుదర్శన్‌రెడ్డి, హౌసింగ్ డీఈ కుప్పుస్వామి, డీఆర్‌యూసీసీ మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ యాడ్ డైరెక్టర్ వడ్డి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ హరిబాబు, గామస్తులు పుతపత్తురి రామసుబ్బారెడ్డి, గజ్జల శ్రీనివాసులరెడ్డి,పుపత్తూరి సుదర్శన్‌రెడ్డి, కొలూరి రమణరెడ్డి, దేవకుమార్ రెడ్డి, సతీష్‌రెడ్డి, కొలూరి సుబ్రమణ్యంరెడ్డి, వేణు, విష్ణు, ఆర్కిటెక్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

రాయచోటి : దళితుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా షెడ్యూల్ కులాల కార్పొరేషన్ ఆధ్వర్యంలో జగనన్న దళిత సంపూర్ణ భూహక్కు పథకం కింద 453 ఎస్సీ మహిళా రైతులకు ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసులుతో కలిసి సంపూర్ణ భూహక్కు పత్రాలను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూమి కొనుగోలు పథకం కింద భూములు ఇచ్చిన ఎస్సీ లబ్ధిదారులకు పూర్తి భూ యాజమాన్య హక్కు కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న దళిత సంపూర్ణ భూహక్కు పథకం' ప్రారంభించి అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 453 మంది షెడ్యూల్ కులాల రైతులకు 567.20 ఎకరాలకు రూ.193.57 లక్షలను మంజూరు చేసి ఎస్సీ మహిళా లబ్ధిదారుల భూమిని తనఖా నుంచి విడుదల చేసి వారికి లబ్ధి చేకూర్చినట్లు చెప్పారు.ఎస్సీ కార్పొషన్ డైరెక్టర్ ఎం .శ్రీనివాసులు మాట్లాడుతూ దళితుల అభివృద్ధికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని దళితులందరూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల కార్యనిర్వాహక సంచాలకులు డాక్టర్ హెచ్.వెంకటసుబ్బయ్య, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

54 మంది న్యాయ వాదులకు లా నేస్తం

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో లా నేస్తం పథకం ద్వారా 54 మంది జూనియర్ న్యాయవాదులకు వారి అకౌంట్లలో నిధులు జమ అయ్యాయి. సోమవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్ లా నేస్తం పథకం కింద.. లబ్ధిదారుల అకౌంట్లలో రూ.30వేల చొప్పున జమ చేశారు. వైఎస్సార్ లా నేస్తం పథకం రెండో విడత నిధులను సోమవారం ఆయన తాడేపల్లి ఆఫీస్ నుంచి రిలీజ్ చేశారు. ఈ నిధులు యువ లాయర్ల అకౌంట్లలో జమ అయ్యాయి. అన్నమయ్య జిల్లా నుంచి డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లాయర్లంతా మంచి కేసులను వాదిస్తూ, పేదవారికి అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తరపున కోరారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతి చెందిన వెంకటేష్

సుండుపల్లె (రాయచోటిటౌన్) : టి.సుండుపల్లె మండలం దూదిమాదిగపల్లెకు చెందిన వెంకటేష్ (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటేష్ భార్య రెండు రోజుల క్రితం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకునేందుకు వెళ్లింది. ఈ పరిస్థితిలో ఆదివారం రాత్రి వెంకటేష్ ఇంటిలో నుంచి బయటికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. పిల్లలు ఇంటిలో నిద్రపోయారు. తెల్లవారి చూస్తే సమీపంలోని గ్రామ ఆస్పత్రి వరండాలో రక్తపుమడుగులో పడి మృతి చెంది ఉన్నాడు. రాత్రి మద్యం తాగి కింద పడటంతో తీవ్ర రక్తస్రావమై మృతి చెందాడా లేక ఎవరైనా కొట్టి చంపారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

టెంకాయల వేలం పాట రూ.9.20 లక్షలు

కాశినాయన : మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన జ్యోతిక్షేత్రంలో కాశినాయన ఆలయంలో సోమవారం టెంకాయల వేలంపాట నిర్వహించారు. టెంకాయల వేలంపాటను రూ.9.20 లక్షలకు పి.నారాయణరెడ్డి, తలనీలాల పాటను రూ.4.50 లక్షలకు కె.ఈశ్వర్‌రెడ్డి దక్కించుకున్నారు. 2024 కాశినాయన ఆరాధన మహోత్సవం వరకు వీరు హక్కు కలిగి ఉంటారు. కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి ప్రజలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న సీడ్యాప్ ప్రతినిధి పెంచలయ్య

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉద్యోగ, ఉపాధి నిమిత్తం ఏర్పాటు చేస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సీడ్యాప్ ప్రతినిధులు పెంచలయ్య, రంగస్వామి తెలిపారు. సోమవారం కడప నగరంలోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగ యువత ఏ చిన్న అవకాశం వదులుకోవద్దని, తమ భవిష్యత్తు తమ చేతుల్లో ఉందన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ప్రస్తుతం చిన్న ఉద్యోగమైనా అంచెలంచెలుగా ఎదిగి భవిష్యత్తులో అగ్రస్థానానికి చేరుకోవచ్చని తెలిపారు. ఈ జాబ్ మేళాలో సుమారు 22 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించగా 276 మంది నిరుద్యోగులు పాల్గొని వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ రీజినల్ కోఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సాయి సునీల్ కుమార్, సిబ్బంది, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ఆర్గానిక్ సర్టిఫికెట్

కడప అగ్రికల్చర్ : ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో గ్రూపులు ఏర్పాటు చేసి పీజీఎస్ ఇండియా ఆర్గానిక్ సర్టిఫికెట్ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు తెలిపారు. సోమవారం కడపలోని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఆర్గానిక్ సర్టిఫికెట్ పొందడంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ పొలంలో విత్తనం వేసింది మొదలు పంట చేతికి వచ్చే వరకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలను టీటీడీ, ఇతర సంస్థలు మార్కెట్ ధర కంటే 10 శాతం అదనంగా ప్రీమియం ధరలతో ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాయని తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఏలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష దీపోత్సవం

- కార్తీకమాస పూజలతో పుణ్యఫలం
- అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామి



శివపార్వతుల కల్యాణోత్సవ దృశ్యం



దీపోత్సవంలో లక్ష దీపాలు వెలిగిస్తున్న మహిళలు

బి.కొత్తకోట : బి.కొత్తకోటలో సోమవారం రాత్రి ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. కార్తీక దీప వెలుగుల్లో ధగధగలాడింది. శ్రీమహా విష్ణుసేన ఆధ్వర్యంలో ఐదోసారి కార్తీకమాస చివరి వారం లక్ష దీపాలతో లక్ష దీపోత్సవ నిర్వహించారు. స్థానిక పీటీఎం రోడ్డులో నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తి పారవశ్యాన్ని కలిగించింది. అతిథుల ఆధ్యాత్మిక ప్రసంగాలు, పార్వతీపరమేశ్వరుల కల్యాణ వేడుకను భక్తులు కనులారా వీక్షించారు. 300 మీటర్ల పొడవునా మూడు వరుసల్లో టేబుళ్లు ఏర్పాటు చేసి వాటిపై లక్ష మట్టిదీపాలను అమర్చారు. వీటిని వెలిగించి పూజలు చేసేందుకు మహిళలు, భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. శివపార్వతుల కల్యాణ వేడుకను పూర్తి చేశాక అతిథిగా హాజరైన బ్రహ్మంగారిమఠం మండలం అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామి అఖండ జ్యోతిని వెలిగించి లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో జరిపే పూజలతో పుణ్యఫలం సిద్ధిస్తుందన్నారు. ఈ మాసంలో నిర్వహించే ప్రతి పూజకు ఫలితం లభిస్తుందని, సర్వరోగాలను హరిస్తాయన్నారు. ఈ కార్యక్రమానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా పోలీసులు ట్రాఫిక్ మళ్లించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్ద పీట



క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి



హాకీ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

- మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి
- ఘనంగా ప్రారంభమైన 67వ ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లా హాకీ పోటీలు

మదనపల్లె సిటీ : రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక బీటీ కాలేజీ హాకీ క్రీడామైదానంలో 67వ ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లా హాకీ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీల్లో ఉమ్మడి 13 జిల్లాల నుంచి హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు. హాకీ క్రీడాకారులు మాక్ డ్రిల్ చేసి క్రీడావందనం చేశారు. హాకీ మైదానంలో స్టిక్‌తో మ్యాచ్‌లను ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ యువత క్రీడారంగంలో రాణించాలన్న ఉద్దేశంతో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని ఈనెల 15న ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో గ్రామస్థాయి క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. మదనపల్లె పేరు చెబితేనే హాకీ క్రీడకు పుట్టినిల్లన్నారు. ఎంతో మంది హాకీ క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణించినట్లు గుర్తు చేశారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఆర్డీఓ మురళి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయన్నారు. ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డీఈఓ శ్రీరాం పురుషోత్తం మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి రాష్ట్ర , జాతీయ స్థాయిలో ఆడే విధంగా తర్ఫీదు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి , రాజగోపాల్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత, వన్‌టౌన్ ఎస్.ఐ హరిహరప్రసాద్, కౌన్సిలర్ గిరిజా, సాయిశేఖర్‌రెడ్డి, పీడీలు పాల్గొన్నారు.

ప్రారంభమైన హాకీ పోటీలు

అంతర్ జిల్లాల హాకీ పోటీల మొదటి రోజు బాలికలు 6 మ్యాచ్‌లు, బాలురు 7 మ్యాచ్‌లు ఆడారు. ఇరు జట్ల మధ్య హోరాహోరీగా పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీలు 13వతేదీ వరకు జరుగుతాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత తెలిపారు.

అంతర్ రాష్ట్ర దొంగల అరెస్ట్

అనంతపురం క్రైం: జల్సాల కోసం ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లే ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను సీసీఎస్, వన్‌టౌన్, ఉరవకొండ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. నిందితుల నుంచి 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అన్బురాజన్ వెల్లడించారు. పట్టుబడిన వారిలో వైఎస్సార్ జిల్లా మైలవరం మండలం బూబుసానిపల్లికి చెందిన గువ్వల పుల్లారెడ్డి, బ్రహ్మంగారి మఠం మండలం పాపిరెడ్డిపల్లి నివాసి గుంప వెంకటరమణారెడ్డి ఉన్నారు. వీరిద్దరూ స్నేహితులు. చెడు వ్యసనాలకు బానిసలైన వీరు డబ్బు కోసం ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లి తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవారు. వీరిపై గతంలో వైఎస్సార్ జిల్లా యర్రగుంట్ల, అనంతపురం నాలుగో పట్టణ, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పోలీసుస్టేషన్ల పరిధిలో కేసులున్నాయి. చాలా కాలంగా ఇద్దరూ ఉరవకొండ, తాడిపత్రి, బళ్లారి, కర్నూలు తదితర ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన వాహనాలను అపహరించారు. ఆయా కేసుల దర్యాప్తులో భాగంగా పాత నేరస్తులపై నిఘా పెట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

సైబర్ నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి



స్పెషల్ బ్రాంచ్ సీఐకు ఫిర్యాదు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాయచోటి అర్బన్ : ఉపాధ్యాయులను మోసం చేసి వారి అకౌంట్లలోని సొమ్మును కాజేసిన సైబర్ నేరగాళ్లపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్. జాబీర్ పోలీసు అధికారులకు విన్నవించారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని సొమ్ము నష్టపోయిన ఉపాధ్యాయులతో కలసి ఆయన సోమవారం రాయచోటి స్పెషల్ బ్రాంచ్ సీఐ సత్యనారాయణను ఎస్పీ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా జాబీర్ మాట్లాడుతూ ఆది, సోమవారాలలో ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపులలో ఎస్‌బీఐ ఇంటర్నెట్ బ్యాంకింగ్ పనిచేయలేదన్నారు. వెంటనే ఎస్‌బీఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సైబర్ మోసగాళ్లు ఎస్‌బీఐ అనధికారిక యాప్‌ను చొప్పించి మోసానికి పాల్పడ్డారన్నారు. సైబర్ క్రైమ్ పట్ల అవగాహన లేని కొందరు ఉపాధ్యాయులు ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి పరిశీలిస్తున్న క్రమంలో వారి అకౌంట్లలోని వేలాది రూపాయల సొమ్ము సైబర్ నేరగాళ్ల అకౌంట్లకు బదిలీ అయినట్లు గుర్తించారన్నారు. దీనిపై స్పందించిన స్పెషల్ బ్రాంచ్ సీఐ ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి సైబర్ నేరగాళ్లపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు చాంద్‌బాషా, ఇందాద్, రాజబాబు పాల్గొన్నారు.

వంద కోసం స్నేహితుడిపై కత్తెరతో దాడి



స్నేహితుడి దాడిలో గాయపడిన మల్లికార్జునరెడ్డి

మదనపల్లె : వంద రూపాయల కోసం స్నేహితుల మధ్య గొడవ జరిగి ఒకరిపై కత్తెరతో దాడిచేసి గాయపరిచిన సంఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. రెడ్డీస్ కాలనీకి చెందిన వెంకటరమణారెడ్డి కుమారుడు ఎం.మల్లికార్జునరెడ్డి(45), స్థానికుడైన వంశీధర్‌రెడ్డి స్నేహితులు. సోమవారం పట్టణంలోని ప్రశాంత్‌నగర్ బోర్డు వద్ద వంశీధర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డిని మద్యం కోసం వందరూపాయలు అప్పుగా అడిగాడు. మల్లికార్జునరెడ్డి ఇచ్చేందుకు నిరాకరించడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈక్రమంలో ఆవేశానికి లోనైన వంశీధరరెడ్డి కత్తెరతో మల్లికార్జునరెడ్డిపై దాడిచేశాడు. దాడిలో మల్లికార్జునరెడ్డికి తీవ్రగాయాలు కాగా, గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మృతి చెందిన యువకుడు



దగ్ధమవుతున్న బైకు

చెన్నూరు : చెన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని బచ్చుంపల్లె సమీపంలో కడప -తిరుపతి హైవేపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పాత కడపకు చెందిన పత్తి వెంకటరమణ కుమారుడు పత్తి ప్రేమ్ (17)డ్యూక్ బైక్ పై వెళుతూ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి బైక్ పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న ప్రేమ్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అయితే యువకుడు బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడా.. లేక ఏదైనా వాహనం ఢీకొనడంతో మృతి చెందాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు చెన్నైలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్నాడని పోలీసులు తెలిపారు.

ఏపీ సివిల్ సర్వీసెస్ క్రికెట్ జట్టుకు ఎంపిక



శ్రీధర్ కుమార్

వాల్మీకిపురం : వాల్మీకిపురానికి చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు జి.శ్రీధర్ కుమార్ సివిల్ సర్వీసెస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారని కోచ్ సునీల్ కుమార్ తెలిపారు. ఈయన కలిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఇటీవల అన్నమయ్య జిల్లా రాయచోటి, అమరావతిలోని విజయవాడ మంగళగిరి ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో మూడు రోజులు శిక్షణ కార్యక్రమం, ఎంపికలు నిర్వహించారు. మంచి ప్రతిభ కనబరచి ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈయన డిసెంబర్ 15 నుంచి 21 వరకు న్యూఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్రికెట్ టోర్నమెంట్ 2023–24లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు రామచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం, వీసీసీ, కేఎస్ఎస్‌బీ క్రికెట్ క్లబ్ సభ్యులు శ్రీధర్ కుమార్‌ను అభినందించారు.

నాగుపామును చూసి.. ఆటోలోంచి దూకి..

తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్



గాయపడిన ఆటోడ్రైవర్ మల్లప్ప

మదనపల్లె : ఆటో నడుపుతున్న సమయంలో రోడ్డుపై అకస్మాత్తుగా నాగుపాము అడ్డుగా రావడంతో ఆటోలోకి వచ్చేస్తోందని భయపడిన డ్రైవర్ వాహనంలో నుంచి దూకి తీవ్రంగా గాయపడిన సంఘటన ములకలచెరువు మండలంలో జరిగింది. సోంపల్లె పంచాయతీ గుడిపల్లె క్రాస్‌కు చెందిన శంకరప్ప కుమారుడు ఎస్.మల్లప్ప(40) ఆటోడ్రైవర్‌గా జీవిస్తున్నాడు. సోమవారం చౌడసముద్రానికి బాడుగ వెళ్లేందుకు బయలుదేరాడు. మార్గమధ్యంలో సంతగానిమిట్ట వద్ద ఆటోకు అడ్డుగా నాగుపాము రావడంతో భయపడిన మల్లప్ప ఆటోలో నుంచి కిందకు దూకేశాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నాడు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కడప స్పోర్ట్స్ : జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్ విభాగం పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు వైఎస్‌ఆర్ జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. తెనాలిలో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన ఏపీ హ్యాండ్‌బాల్ బాలబాలికల చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన గురువర్ధన్, నాగేంద్ర, మురళీకృష్ణలు చక్కటి ప్రతిభ కనబరిచారు. దీంతో 2024 జనవరిలో రాజస్థాన్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి జూనియర్ బాలుర విభాగం పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు ఎంపికయ్యారు. అదే విధంగా బాలికల విభాగంలో పల్లవి, ప్రసన్నలు ఏపీ బాలికల జట్టుకు ఎంపికయ్యారు. వీరు డిసెంబర్ 16 నుంచి 20వ తేదీ వరకు వారణాసిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ బాలికల విభాగం పోటీల్లో పాల్గొననున్నారు. వీరి ఎంపికపై జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షుడు లయన్ కె. చిన్నపరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివప్రసాద్, కోచ్ అబ్దుల్ మునాఫ్ అభినందనలు తెలిపారు.



ఎంపికైన క్రీడాకారులతో హ్యాండ్‌బాల్ సంఘం ప్రతినిధులు

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యవస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

మారిన ప్రభుత్వ పాఠశాలల రేపురేఖలు



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. గతంలో ప్రభుత్వ పాఠశాలలు అంటేనే భయపడే తల్లిదండ్రులు నాడు–నేడు కార్యక్రమంతో మారిన ప్రభుత్వ పాఠశాలల్లో వారి పిల్లలను చదివిస్తున్నారు. దానికి తోడు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన ఇంగ్లీష్ మీడియంతో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా విద్యాబోధన అందిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో గణనీయంగా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. దీనికంతటికీ సీఎం జగన్ కృషి ఎంతో ఉంది.

– అఫ్గన్ రియాజ్‌ఖాన్, స్కూల్ కమిటీ చైర్మన్, ఉర్దూ హైస్కూల్, చిన్నమండెం

త్వరగా కుల ధ్రువీకరణ పత్రాలు



కుల ధ్రువీకరణ పత్రాలు జగనన్న సురక్ష ద్వారా అతి త్వరగా వచ్చాయి. గతంలో దరఖాస్తు చేసుకుని కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లం. అయినా పట్టించుకునే వారు లేరు. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో ఎంతో ప్రయోజనం చేకూరింది. వలంటీర్ మా ఇంటి వద్దకే వచ్చి మా వివరాలు తీసుకెళ్లి సర్టిఫికెట్ వచ్చేలా చూశారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతోమందికి ప్రయోజనం చేకూరుస్తోంది.

– గానుకపెంట పురుషోత్తం, బొజ్జవారిపల్లె, రైల్వేకోడూరు మండలం.

సొంతింటి కల సాకారం



జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సొంత ఇల్లు రావడం ఎంతో సంతోషంగా ఉంది. సొంతింటి కోసం ఎన్నో సంవత్సరాల నుంచి ఎదురు చూస్తున్నాను. మా సొంతింటి కల జగనన్న హయాంలో తీరింది. చాలా సంతోషంగా ఉన్నాము. నిర్మాణం చేసుకుని ఆ ఇంటిలోనే నివాసం ఉంటున్నాము. మాకు గూడు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాము.

– లీలావతి, రాజీవ్ గిరిజన కాలని, రైల్వేకోడూరు మండలం

